నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మారుతీనగర్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. మారుతీనగర్, బిఎల్‌నగర్, పీఎస్‌ఆర్‌కాలనీ, ఎస్‌బీఆర్‌కాలనీ, లెక్చరర్స్ కాలనీ, సుభాష్‌నగర్, ఎస్సీ బస్తీ, మణికంఠనగర్, శ్రీసాయినగర్, టెలిఫోన్ కాలనీ, రామిరెడ్డి నగర్, యాదాద్రి కాలనీ, యాదవ్ బస్తీ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హబ్సిగూడ ఫీడర్ పరిధిలో..

ఉప్పల్: హబ్సిగూడ ఫీడర్ పరిధిలోని ఎన్జీఆర్ఐ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం నాగేందర్‌నగర్, జహీర్‌నగర్, సాయి ఎన్‌క్లేవ్, సైంటిస్టుకాలనీ, హబ్సిగూడ ప్రధాన రహదారి, ఎన్జీఆర్ఐ, ఐఐసీటీ ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఫీడర్ పరిధిలో..

కుషాయిగూడ: బీఎస్ఎన్ఎల్ ఫీడర్ పరిధిలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ గంగాభవానీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కమలానగర్ చైతన్య కళాశాల, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు, సత్తిరెడ్డి గల్లీ, ప్రభుత్వ పాఠశాల, మహేష్‌నగర్, జీహెచ్ఎంసీ కార్యాలయం, అయ్యప్పస్వామి టెంపుల్ ప్రాంతం, సౌత్ కమలానగర్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన సదస్సులో విద్యార్థులు

బోడుప్పల్: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పాఠశాల నిర్వాహకులు హెచ్ఎంపీ వైరస్ పట్ల అవగాహన కల్పించారు. దగ్గుతున్నప్పుడు, తుమ్ముతున్నప్పుడు నోటికి, ముక్కుకు హ్యాండ కర్చీఫ్, టిష్యూ పేపర్‌ను అడ్డుపెట్టుకోవాలన్నారు. సబ్బు లేదా శానిటైజర్‌తో చేతులు కడుక్కోవాలని సూచించారు. అనారోగ్యం బారిన పడినప్పుడు వెంటనే డాక్టర్ సలహా మేరకు మందులు వేసుకోవాలన్నారు. మాస్క్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఈస్ట్ ఇందిరా నెహ్రూనగర్‌లో రూ.22 లక్షల వ్యయంతో కొనసాగుతున్న ఆర్‌సీసీ పైపులైన్ నిర్మాణ పనులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ దివ్యజ్యోతి, నాయకులు మేకల సునీత రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓం నమో నారాయణాయ..!

• ముక్కోటి ఏకాదశికి దేవాలయాలు ముస్తాబు • నేడు ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనాలు


సత్యనారాయణస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం




అల్వాల్‌లో అంగరంగ వైభవంగా ముస్తాబైన బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం


అల్వాల్‌లో ముస్తాబైన బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం


లక్ష్మీనారాయణ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారాలు


ముస్తాబైన శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం


సత్యనారాయణస్వామి ఆలయంలో శంఖుచక్ర నామాలతో అలంకరించిన దృశ్యం

అల్వాల్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జోన్ పరిధిలోని దేవాలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల దర్శనం కోసం వైకుంఠ ద్వారం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను పూర్తి చేశారు. శుక్రవారం తెల్లవారుజాము నుండే స్వామివారి దర్శనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అల్వాల్‌లోని పురాతనమైన బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

కుషాయిగూడలో ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ

కుషాయిగూడ: కుషాయిగూడలోని శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లను గురువారం కుషాయిగూడ ఏసీపీ మహేష్‌కుమార్ పరిశీలించారు. ఆలయ చైర్మన్ సంకరి శ్రీనివాస్‌గౌడ్, ఈఓ. వీరేశంతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. భక్తుల తాకిడికి అనుగుణంగా ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఏకాదశి సందర్భంగా ప్రధాన ఆలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

విద్యుద్దీపాల వెలుగులో ఆలయాలు

రామంతాపూర్: రామంతాపూర్‌లోని వివిధ వైష్ణవ దేవాలయాల్లో నిర్వహించే వైకుంఠ ఏకాదశి పర్వదినానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీల నిర్వాహకులు తెలిపారు. ఇందిరానగర్‌లోని శ్రీరమణ సహిత సత్యనారాయణస్వామి దేవాలయం, గోకుల్‌నగర్‌లోని శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, కేసీఆర్‌నగర్‌లోని శ్రీవెంకటేశ్వర ఆలయం, లక్ష్మీనారాయణ కాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాల్లో ఉదయం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉత్తర ద్వారాల ద్వారా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు.

బోడుప్పల్ అభివృద్ధికి రూ.43.37 కోట్లతో ఏకగ్రీవ తీర్మానం


బోడుప్పల్ పాలకవర్గ సమావేశంలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: పలు అభివృద్ధి పనుల కోసం బోడుప్పల్ పాలకవర్గం రూ..43.37 కోట్లతో ఏకగ్రీవ తీర్మానం చేసింది. బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సీసీరోడ్ల కోసం రూ.14.24 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కొరకు రూ. 6.92 కోట్లు, బీటీ రోడ్ల సుందరీకరణకు, రి కార్పెటింగ్ కొరకు రూ. 2.25 కోట్లు, సుద్దకుంట నాలా నిర్మాణం కొరకు రూ. 5.50 కోట్లు, సర్వేనంబర్ 63లో ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ వేయుటకు రూ.1.50 కోట్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం కొరకు రూ.1.94 కోట్లు, నిర్వహణ పనుల నిమిత్తం కొరకు రూ.5.35 కోట్లు, బీటీ రోడ్ల నిర్మాణం కొరకు రూ.1.45 కోట్లు, ఒపెన్ జిమ్ కొరకు రూ.55లక్షలు, హైమాస్ట్ పోల్స్ నిర్మాణం కొరకు రూ.71.50లక్షలు, సాయిబాబా టెంపుల్ జంక్షన్, చెంగిచర్ల నందలి సాయి రెసిడెన్సీ వెళ్లే రోడ్డు జంక్షన్ కొరకు రూ.50లక్షలు తీర్మానించారు.

◆ చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణంలో స్కూల్ వాతావరణం దెబ్బతీసే విధంగా అక్రమంగా 11 షట్టర్లను నిర్మిస్తున్నారని కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, పోగుల నర్సింహారెడ్డి కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. 1000మంది విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వాటిని తొలగించాలని వారు డిమాండ్ చేశారు. వాటిని నిలుపుదల చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

పైపులైన్ పునర్ నిర్మాణ పనులు చేపట్టాలి


జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీతో పాటు తాగునీటి పైపులైన్ పునర్ నిర్మాణ పనులు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని గురువారం కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. డివిజన్ పరిధిలోని ఎగ్జిక్యూటివ్ కాలనీ, న్యూమెస్ కాలనీ, బండబస్తీ, కుమ్మరి బస్తీలలో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్‌లు స్థానంలో కొత్త పైపులైన్‌లు వేయాలని కోరారు. వాటి కోసం నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నవనీత, మధుసూదన్ తదితరులు ఉన్నారు.

కరెంట్ కష్టాలు



మౌలాలి: వినాయక్‌నగర్ బ్లాక్ నం.1లో గురువారం సాయంత్రం 4గంటల నుంచి పవర్ తీసేశారని బస్తీవాసులు ఆగ్రహిస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండానే పవర్ తీసేశారని అటు పవర్ లేకుండా ఇటు దోమలతో నానా ఇబ్బందులు పడుతున్నామని బస్తీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

రామంతాపూర్ : గాంధీనగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. నాసిరకం మెటీరియల్‌తో నిర్మిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ హరిలాల్, ఏఈ శ్వేతా శ్రీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలోని పీర్జాదిగూడ నుంచి కాచవాని సింగారం ప్రధాన రహదారి విస్తరణ పనులను డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. కొన్నేళ్లుగా రోడ్డు పనుల వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. త్వరితగతిన రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడి కట్టు శబరిమలెక్కు..!



మౌలాలి: మల్కాజిగిరి సర్కిల్ మౌలాలి డివిజన్ పరిధిలోని సంతోషిమాతా ఆలయం నుంచి గురువారం అయ్యప్ప స్వాములు ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్రకు బయల్దేరారు. అశోక్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి ప్రక్రియ శాస్త్రోక్తంగా జరిగింది. కార్యక్రమంలో ఓరుగంటి పైదులు, ఓరుగంటి చందు గురుస్వామితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు నంద్యాల కృష్ణ, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్త సతీష్‌బాబుకు ప్రశంసల వెల్లువ

కుషాయిగూడ: చర్లపల్లి టెర్మినల్ నిర్మాణంలో భాగస్వామ్యమైన చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్-3కి చెందిన పారిశ్రామికవేత్త కన్నెగంటి సతీష్‌బాబును ఫేజ్-3 పారిశ్రామికవేత్తల సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మియాపురం రమేష్, ఉపాధ్యక్షుడు మండా సురేష్ ఆయనపై ప్రశంసల వెల్లువ కురిపించారు. చర్లపల్లి టెర్మినల్‌లో వంతెనలు, ఫ్లాట్‌ఫామ్స్ నిర్మాణంలో కీలక భూమిక పోషించాడన్నారు. ఇంటర్ మీడియట్ ఓవర్ హాలింగ్‌ల నిర్మాణంలోనూ సతీష్‌బాబు చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు శేషిరెడ్డి, బాబర్ ఆలీ, సునీల్, వెంకట్రామిరెడ్డి, కిరణ్, శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.


సతీష్‌బాబు సత్కరించిన మియాపురం రమేష్, మండా సురేష్

గంజాయి విక్రయిస్తున్న బిహారీ ముఠా అరెస్టు



ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్న బిహారీ ముఠాను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ ఏసీవీనగర్ ప్రాంతానికి చెందిన మధన్‌రామ్ తెలిసిన వారి నుంచి బిహారీ నుంచి గంజాయి తీసుకొచ్చి ఉప్పల్, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం మల్లాపూర్‌లో కాపుకాసి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు ఛేదించిన వారిలో ఎస్సై పి.నరేష్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అవార్డులు ఆయన సొంతం!

అతడో జానపద గ్రంథం. ఆయన రాసిన, ఆలపించిన పాటలు అందరినీ ఉర్రూతలూగిస్తున్నాయి. పల్లె, పట్టణ ప్రజల జీవన విధానాన్ని పాటగా రాస్తూ స్వయంగా పాడుతారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో గళం విప్పి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. అంతే కాదు తనతో పాటు ఆసక్తిగల వారికి ఈ కళను అందిస్తూ ప్రోత్సహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు అనుముల ప్రభాకరాచారి.






అప్పటి ఉపరాష్ట్రపతి హమీద్ అన్సరీ, సీఎం వైఎస్సార్ చేతుల మీదుగా ఉత్తమ జాతీయ, రాష్ట్ర ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకుంటున్న ప్రభాకరాచారి (ఫైల్ ఫొటో)


ఓ నాటకంలో ప్రభాకరా చారి పాత్ర

మల్లాపూర్: సూర్యాపేటలో 1961లో సుందరయ్య, సరోజమ్మకు జన్మించిన అనుముల ప్రభాకరాచారి మల్టీ ట్యాలెంట్‌తో అందరి మన్ననలు పొందుతున్నాడు. 1981లో యాదగిరిగుట్ట మండలంలో ఉపాధ్యాయుడిగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి 2019లో ఉద్యోగ విరమణ పొందారు. 1985లో ఉత్తమ రాష్ట్ర ఉపాధ్యాయుడిగా అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును ప్రభాకరాచారి అందుకున్నారు. 1988లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా, ఉపరాష్ట్రపతితో సన్మానం సత్కారాలను అందుకున్నారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలలో కవితా గానం చేసి, రాష్ట్ర ప్రభుత్వం సత్కారన్ని అందుకున్నారు. కవిగా 1200పైగా యాదాద్రి నరసింహస్వామిపై భక్తి కీర్తనలు రాసి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ అందుకున్నారు.

గాయకుడిగా...

ఆల్ఇండియా రేడియా, యువవాణి, జానపద గాయకుడిగా ఎన్నో పాటలను పాడి ఆడిషన్ సర్టిఫికెట్లు పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తింపు పొందిన రచయితగా, గాయకుడిగా, కంపోసర్‌గా రాణిస్తున్నారు.

75 నిమిషాల పాటు వందేమాతరం..

75 ఏళ్ల వజ్రోత్సవ భారతికి తన కృతజ్ఞత అభినందనాలుగా సావర్కర్ నగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ సౌజన్యంతో 75నిమిషాల పాటు వందేమాతరం గీతాన్ని సంగీతంలో ఆలపించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డును అందుకున్నారు. కవి, గాయకుడిగా అనేక సంస్థలు చేత సత్కారాలు పొందారు.

రచనలు.. కవితా పుస్తకాలు

ప్రభాకరాచారి ఎన్నో రచనలు రాశారు. బోనాలు, చిన్ననాటి వాన, ఆంజనేయ, సుప్రభాతం, బడి పాటలు, పాటలతో పరీక్షలో విజయాలు, పర్యావరణం పేరుతో కవితా పుస్తకాలు అచ్చు వేయించారు. యాద్రాది లక్ష్మీనరసింహాస్వామి భక్తి పాటల పుస్తకాన్ని ముద్రించారు.

సేవా సంస్థలు, కార్యక్రమాలు...

ప్రభాకరాచారి 1985లో కళా సూర్యకల్చరల్ ఆర్గనేజేషన్‌ను స్థాపించి పలు సేవా కార్యక్రమాలను ఇప్పటికీ చేపడుతున్నారు. 2000 నుంచి యాద్రాది లక్ష్మీ నరసింహాస్వామి కీర్తనావాణి పేరున సంస్థలు స్థాపించి అనేక భక్తి, సామాజిక విద్య, కార్యక్రమాలు, సంగీత, సాహిత్య కార్యక్రమాలను చేస్తూ కులవృత్తిగా బంగారు, వెండి, పనులను చేస్తూ పనీపాట లేకుండా ఎవరూ జీవితం గడపొద్దనే సందేశమిస్తూ జీవిస్తున్నారు. చదువు వెలుగులో సాంస్కృతిక ప్రతినిధి గా ఆలేరు బ్లాక్ అంతా తిరిగి అక్షరాస్యులను చేయటంలో ఎంతో ఆనందం కల్గిందంటారు ప్రభాకరా చారి,సమాజాన్ని బడి అభివృద్ధికి ఉపయోగించు కోవడంలో వంద శాతం విజయవంతం జరిగిందంటారు. పలు స్టేజీల మీదా నటునిగా అప్పుడప్పుడూ నాటకాలు వేయడం ఆనందానిచ్చిందంటారు.